


S4S దందా!

కార్మికులను నిలువుదోపిడీ చేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ

- ఇష్టారాజ్యంగా నెలనెలా జీతాల్లో కోతలు
- పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం లేకుండానే ఏళ్ల కొద్దీ విధులు
- యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే పనిష్‌మెంటే..
- పోలీసుల పేరుచెబుతూ బెదిరింపులు!
- కనీస పర్యవేక్షణలేని అధికార యంత్రాంగం
- వరంగల్ మహానగరంలో చీకటి సామ్రాజ్యం?

అక్షరశక్తి
The Power of Pen
Evening Daily

సంపుటి: 20 | సంచిక: 315 | వరంగల్ | మంగళవారం, 22 సెప్టెంబర్ 2026 | పేజీలు: 06



నాకిచ్చే నెలజీతం రూ.8500. రెండేళ్లుగా పనిచేస్తున్నా. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం ఉందో లేదో తెలియదు. మాకేమీ చెప్పరు. నాకేమీ తెలియదు. చెప్పిన పనిచెయ్యాలి. ఫోన్ చేసినా స్పందించరు. రెండేళ్లుగా ఒక్కటే డ్రెస్ వాడుతున్నా. అదికూడా చినిగిపోతోంది. డ్యూటీ డ్రెస్ అడిగితే.. డబ్బులు అడుగుతుండ్రు. కసురుకుంటరు ఇది వరంగల్ మహా నగరంలోని S4S ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలో పనిచేస్తున్న ఓ కార్మికుడి ఆవేదన. ఏజెన్సీ అక్రమాలకు అడ్డూ అదుపులేకుండా పోయిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అడిగేవారు లేరు.. సంబంధిత అధికారయంత్రాంగ పర్యవేక్షణలేదు.. ఇంకేముంది.. సదరు ఏజెన్సీ కార్మికులను నిలువునా దోచుకుంటూ వరంగల్ మహానగరంలో ఓ చీకటి సామ్రాజ్యాన్నే నిర్మించుకుని దందా నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కరు ఇద్దరు కాదు.. ఏకంగా ఆ ఏజెన్సీలో సుమారు 1500మందికిపైగా కార్మికులు నిలువుదోపిడీకి గురవుతున్నట్లు సమాచారం. ఇదేమిటని ప్రశ్నించిన కార్మికులకు పనిష్‌మెంట్‌తోపాటు పోలీస్ అధికారులు, ఇతర అధికారుల పేర్లు చెబుతూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. - అక్షరశక్తి, వరంగల్

2

ఎంజీఎం వద్ద ఉద్రిక్తత





- ఎంజీఎంలోకి వెళ్లకుండా దాస్యంను అడ్డుకున్నపోలీసులు
- నిర్బంధాలను ఛేదించిన వినయ్‌భాస్కర్..
- పోలీసులతో తోపులాట.. మాజీ ఎమ్మెల్యేకు గాయాలు..
- కాలు, చేతి నుంచి రక్తస్రావం
- నాకు ఎంజీఎంలోనే చికిత్స చేయండి..
- పోలీసుల తీరుపై దాస్యం ఆగ్రహం

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి వద్ద మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆస్పత్రిలో వరుసగా చోటుచేసుకుంటున్న ప్రమాదాలు, మౌలిక వసతుల కొరత, రోగుల ఇబ్బందులను పరిశీలించేందుకు వెళ్లిన ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌ను పోలీసులు అడ్డుకోవడంతో బీఆర్ఎస్ శ్రేణులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. - అక్షరశక్తి, వరంగల్

3

దళిత, గిరిజనుల అభివృద్ధే లక్ష్యం

- విద్య, ఉపాధి, నైపుణ్యాలతోనే సమాజంలో మార్పు
- అణిచివేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేద్దాం
- అట్రాసిటీ బాధితులకు సకాలంలో పరిహారం.. 'గ్రీన్ ఛానెల్'లో నిధులు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీస్ కేసులపై ఉన్నతస్థాయి కమిటీ సమీక్ష



దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే సమాజంలో శాశ్వత మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలపై అణిచివేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నిరోధక చట్టం-1989 అమలుపై మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆయన అధ్యక్షతన ఉన్నతస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు, విచారణ, పరిష్కారం, బాధితులకు అందుతున్న సహాయం, పునరావాసం తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. - అక్షరశక్తి, హైదరాబాద్

6



జీడికల్ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కడియం శ్రీహరి సమీక్ష

అక్షరశక్తి, జీడికల్: లింగాలఘనపూర్ మండలంలోని జీడికల్ గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో కార్తీక మాసంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే అవసరమైన కార్యాచరణను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని కడియం శ్రీహరి తెలిపారు. విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎన్పీడీసీఎల్ జనగామ జిల్లా ఎస్ఈ చెరుకు సంపత్ రెడ్డి, జనగామ డీఈ ఎం.లక్ష్మీనారాయణ రెడ్డి, దేవరుప్పుల ఏడీఈ అనిల్, లింగాల ఘనపూర్ ఏఈ శంకరయ్య, లైన్ ఇన్స్పెక్టర్ ఎడ్ల శ్రీనివాస్, అసిస్టెంట్ లైన్‌మెన్లు శివ, రవితేజ, అన్‌మ్యాన్డ్ వర్కర్ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి

ఎంవివి కన్వీనర్,ప్రజా సంఘాల జెఏసి చైర్మన్ మాదాసి సురేష్!



అక్షరశక్తి, హనుమకొండ: మాదిగ సామాజిక వర్గానికి చెందిన బలమైన నాయకుడు, మాదిగ హక్కుల దండోరా గౌరవ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నేత, పేదల డాక్టర్ గా పేరుగాంచిన డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు రాబోయే నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం కల్పించాలని విద్యావంతుల వేదిక (ఎంవీవీ) కన్వీనర్, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం హన్మకొండలో ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం డాక్టర్ రామకృష్ణ ఎంతో కృషి చేశారని,రామకృష్ణ హాస్పిటల్ ద్వారా నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా కాకతీయ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ (కే మ్యాక్స్) ద్వారా ప్రజలకు విద్య,వైద్యము, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు.మాదిగలకు కాంగ్రెస్ పార్టీ కన్న తల్లి లాంటిదని, అలాంటి పార్టీలో మాదిగ బిడ్డకు ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే అత్యధిక మెజారిటీతో గెలిపించుకునే బాధ్యత తమదన్నారు.కావున పార్టీ అధిష్టానం డాక్టర్ రామకృష్ణకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని, లేదా రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవిని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది అసైన్డ్ భూమి సమితి అధ్యక్షుడు కలకోటి మహేందర్, దళిత సంఘాల నాయకులు మోరే ఐలయ్య,పోలేపాక రాము, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన నాయకురాలి జన్మదిన వేడుకలు



అక్షరశక్తి, మడికొండ: ఉమ్మడి వరంగల్ జిల్లా జనసేన పార్టీ మహిళా నాయకురాలు డాక్టర్ పద్మజ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వర్ధన్నపేట నియోజకవర్గ నాయకుడు పల్లపు మధు ఆధ్వర్యంలో ఆమెను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శేషాద్రి సందీప్, గాదె పృథ్వి, వస్కుల వంశీ, జిమ్ ప్రసాద్, వస్కుల నవీన్, జాన పట్ల రామ్‌లక్ష్మణ్, పసునూరి ప్రశాంత్, పల్లపు రాజేష్ పాల్గొన్నారు.

S4S దందా..!

- **కార్మికులను నిలువుదోపిడీ చేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ**
- **ఇష్టారాజ్యంగా నెలనెలా జీతాల్లో కోతలు**
- **పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం లేకుండానే ఏళ్ల కొద్దీ విధులు**
- **యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే పనిష్‌మెంటే..**
- **పోలీసుల పేరుచెబుతూ బెదిరింపులు!**
- **కనీస పర్యవేక్షణలేని అధికార యంత్రాంగం**
- **వరంగల్ మహానగరంలో చీకటి సామ్రాజ్యం?**

అక్షరశక్తి, వరంగల్: నాకిచ్చే నెలజీతం రూ.8500. రెండేళ్లుగా పనిచేస్తున్నా. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం ఉందో లేదో తెలియదు. మాకేమీ చెప్పరు. నాకేమీ తెలియదు. చెప్పిన పనిచెయ్యాలి. ఫోన్ చేసినా స్పందించరు. రెండేళ్లుగా ఒక్కటే డ్రెస్ వాడుతున్నా. అదికూడా చినిగిపోతోంది. డ్యూటీ డ్రెస్ అడిగితే.. డబ్బులు అడుగుతుండ్రు. కసురుకుంటరు ఇది వరంగల్ మహా నగరంలోని S4S ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలో పనిచేస్తున్న ఓ కార్మికుడి ఆవేదన. ఏజెన్సీ అక్రమాలకు అడ్డూ అదుపులేకుండా పోయిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అడిగేవారు లేరు.. సంబంధిత అధికారయంత్రాంగ పర్యవేక్షణాలేదు.. ఇంకేముంది.. సదరు ఏజెన్సీ కార్మికులను నిలువునా దోచుకుంటూ వరంగల్ మహానగరంలో ఓ చీకటి సామ్రాజ్యాన్నే నిర్మించుకుని దందా నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కరు ఇద్దరు కాదు.. ఏకంగా ఆ ఏజెన్సీలో సుమారు 1500మందికిపైగా కార్మికులు నిలువుదోపిడీకి గురవుతున్నట్లు సమాచారం. ఇదేమిటని ప్రశ్నించిన కార్మికులకు పనిష్‌మెంట్‌తోపాటు పోలీస్ అధికారులు, ఇతర అధికారుల పేర్లు చెబుతూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

జాడలేని ఈఎస్ఐ, పీఎఫ్

S4S ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా.. వరంగల్ నగరంలోని అనేక ప్రైవేట్ ఆస్పత్రులు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న సెక్యూరిటీ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం లేనట్లు తెలుస్తోంది. రెండు మూడేళ్లుగా పనిచేస్తున్నా.. తమకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం గురించి తెలియదని అనేక మంది కార్మికులు చెబుతుండడం గమనార్హం. అసలు జీతమెంతో కూడా తెలియదని, వాళ్లు ఇచ్చిందే తీసుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ మరొక విషయం ఏమిటంటే.. కొన్నికొన్ని సంస్థల్లో పనిచేస్తున్న సదరు ఏజెన్సీ కార్మికులకు రెండు మూడు నెలలైనా జీతాలు ఇవ్వడంలేదని తెలుస్తోంది. ఇదంతా కూడా సదరు ఏజెన్సీ ఇష్టారాజ్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇదే సమయంలో వేతనాల నుంచి ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్), ఉద్యోగుల రాష్ట్ర బీమా (ఈఎస్ఐ) కోసం నగదు కట్ చేస్తూనే.. ఆ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేయకుండా నిధులను దిగమింగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒప్పందం ప్రకారం పూర్తి వేతనాన్ని ఇవ్వకుండా "సర్వీస్ ఛార్జీల" నెపంతో ఒక్కో కార్మికుడి నుంచి 15శాతం నుండి 20శాతం వరకు కమీషన్లను దండుకుంటున్నట్లు తెలుస్తోంది.

ప్రతీనెల రూ.3వేల నుంచి రూ.5వేలు..



సదరు ఏజెన్సీ కింద సుమారు 1500 మందికిపైగా కార్మికులు పనిచేస్తుండగా.. నిబంధనలకు విరుద్ధంగా వారిలో ఒక్కొక్కరి వేతనం నుంచి ప్రతి నెలా రూ. 3 వేల నుంచి రూ.5వేల వరకు కోతలు పెడుతున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇక పనిగంటల గురించి చెప్పాల్సిన పనిలేదు. 8 గంటలు పని చేయించాల్సి ఉండగా, గార్డులతో 12 నుండి 16 గంటల వరకు బలవంతంగా పనిచేయిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక వీక్లీ ఆఫ్, పండుగ సెలవులు దేవుడెరుగు. కనీసం అనారోగ్య సెలవులు కూడా ఇవ్వకుండా కార్మికులను వేధిస్తున్నట్లు తెలుస్తోంది. వేధింపులు భరించలేక డ్యూటీ మానేసిక కార్మికులకు మొత్తమే జీతాలు ఇవ్వడంలేదని తెలుస్తోంది. మొత్తంగా అటు ప్రభుత్వం నుంచిగానీ... అధికార యంత్రాంగం నుంచిగానీ నియంత్రణ, నిరంతర పర్యవేక్షణ లేకపోవడంతో సదరు ఏజెన్సీ ఆగడాలకు అడ్డూఅదుపులేకుండా పోయినట్లు సమాచారం.

వార్డెన్ సస్పెండ్

- **సంక్షేమ బియ్యం అక్రమ తరలింపుపై కలెక్టర్ సీరియస్**
- **బాలసముద్రం వార్డెన్ పై వేటు**
- **శాఖాపరమైన విచారణకు ఆదేశం**
- **అక్షరశక్తి కథనానికి స్పందన**

అక్షరశక్తి, హన్మకొండ క్రైమ్: బాలసముద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహానికి సంబంధించిన సంక్షేమ బియ్యాన్ని అక్రమంగా బయటకు తరలిస్తూ అడ్డంగా దొరికిన ఘటనపై ఇటీవల అక్షరశక్తి లో ప్రచురితమైన "అమ్మకానికి సంక్షేమ బియ్యం"కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించారు. గత నెల చివరి ఆదివారం రోజున హాస్టల్ వార్డెన్ ఆటోలో బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నారు. 16 రోజులు గడిచిన ఎలాంటి చర్యలు లేకపోవడంపై అక్షరశక్తి ప్రచురించిన కథనాన్ని కలెక్టర్ సీరియస్ గా పరిగణించారు. వెంటనే జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి నుండి నివేదిక తెప్పించుకున్నారు. విచారణలో వార్డెన్ నిర్లక్ష్యం, అక్రమ తరలింపు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో సదరు హాస్టల్ వార్డెన్ ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసులు ఇప్పటికే వార్డెన్ తో పాటు ఆటో డ్రైవర్ పై కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీని కలెక్టర్ కు అందజేశారు. దీనిపై పూర్తి స్థాయి శాఖాపరమైన విచారణ జరిపి, స్టాక్ రిజిస్టర్, నిల్వలు, వినియోగంలో ఏమైనా తేడాలు ఉన్నాయా అనే కోణంలో కూడా విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తీసుకున్న తక్షణ చర్యలపై విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అక్షరశక్తి కథనానికి స్పందించి చర్యలు తీసుకున్న కలెక్టర్ కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద

అక్షరశక్తి, వరంగల్, సెప్టెంబర్ 22 : బుధవారం వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయడమైనదని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఒక ప్రకటన లో పేర్కొన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగే నిమజ్జన ఏర్పాట్లకు అధికారులను షిఫ్ట్‌ల వారీగా విధులు కేటాయించడం జరిగిందని, చిన్న వడ్డేపల్లి, కట్ట మల్లన్న చెరువు-గోరెకుంట, అగర్తల చెరువు, ఉర్సుగుట్ట, బెస్తం చెరువు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. అలాగే మదన్నపేట నర్సంపేట, దుగ్గొండి చెరువు, పాకాల



చెరువు, కొల్లకుల చెరువు చెన్నారావుపేట, గురిజాల పెద్ద చెరువు, నల్లబెల్లి పెద్ద చెరువు, రంగాయి చెరువు, నెక్కొండ చెరువు, చంద్రుగొండ కుంట, కోనారెడ్డి ట్యాంక్ తదితర ప్రాంతాల్లోనూ అధికారులు విధులు నిర్వహించనున్నారు. నిమజ్జన ప్రాంతాల్లో ఈతగాళ్లు, పడవలు, 108 అత్యవసర సేవలు, వైద్య బృందాలు, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో క్రేన్లు, ఆపరేటర్లు, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ, సివిల్ డిఫెన్స్ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. అన్ని నిమజ్జన కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, డీజిల్, నీటి ట్యాంకర్లు అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు తమకు కేటాయించిన సమయాల్లో తప్పనిసరిగా కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. వరంగల్, నర్సంపేట రెవెన్యూ డివిజనల్ అధికారులు మొత్తం నిమజ్జన ఏర్పాట్లకు సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తూ అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని నిమజ్జన కార్యక్రమాన్ని సురక్షితంగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు.

ఎంజీఎం వద్ద ఉద్రిక్తత

- ఎంజీఎంలోకి వెళ్లకుండా దాస్యంను అడ్డుకున్నపోలీసులు
- నిర్బంధాలను ఛేదించిన వినయ్‌భాస్కర్..
- పోలీసులతో తోపులాట.. మాజీ ఎమ్మెల్యేకు గాయాలు..
- కాలు, చేతి నుంచి రక్తస్రావం
- నాకు ఎంజీఎంలోనే చికిత్స చేయండి..
- పోలీసుల తీరుపై దాస్యం ఆగ్రహం





అక్షరశక్తి, వరంగల్, సెప్టెంబర్ 22: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి వద్ద మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆస్పత్రిలో వరుసగా చోటుచేసుకుంటున్న ప్రమాదాలు, మౌలిక వసతుల కొరత, రోగుల ఇబ్బందులను పరిశీలించేందుకు వెళ్లిన ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌ను పోలీసులు అడ్డుకోవడంతో బీఆర్ఎస్ శ్రేణులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఈ ఘటనలో వినయ్‌భాస్కర్ గాయపడినట్లు ఆయన వర్గాలు తెలిపాయి. కాలు, చేతి నుంచి రక్తస్రావం అయినట్లు పేర్కొన్నారు. ఎంజీఎం ఆరోగ్యశ్రీ వార్డులో ఇటీవల పైకప్పు పెచ్చులు ఊడిపడటంతో ముగ్గురు సహా పలువురికి గాయాలైన ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఆస్పత్రి భవనం భద్రత, నిర్వహణపై ప్రశ్నలు తలెత్తాయి.

అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత

ఎంజీఎంలో రోగులను పరామర్శించి, ఆస్పత్రిలోని పరిస్థితులను తెలుసుకునేందుకు వినయ్‌భాస్కర్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి అక్కడికి చేరుకున్నారు. అయితే ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద పోలీసులు ఆయనను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. వినయ్‌భాస్కర్‌ను ఆస్పత్రిలోకి అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగాయి. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఎంజీఎం ప్రధాన గేటు పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్ శ్రేణులు పోలీసులతో వాగ్వాదానికి దిగాయి. అనంతరం తోపులాట చోటుచేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే వినయ్‌భాస్కర్ గాయపడ్డారు. అనంతరం ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

కడుపులో తన్నారు..

తనపై పోలీసులు దాడి చేశారని వినయ్‌భాస్కర్ ఆరోపించారు. పోలీసుల తోపులాటలో తాను గాయపడ్డానని, కడుపులో తన్నారని, చేయికి గాయమైందని కన్నీటి పర్యంతమైనట్లు ఆయన వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ ప్రభుత్వ కనుసన్నల్లోనే పోలీసులు తనపై దాడికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. తనను ప్రభుత్వ ఆస్పత్రి అయిన ఎంజీఎంలో కాకుండా ప్రైవేటు ఆస్పత్రికి తరలించడంపైనా ఆయన అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిపారు. 'నాకు ఎంజీఎంలోనే చికిత్స అందించండి.. ప్రైవేటు ఆస్పత్రికి వద్దు' అని ఆయన కోరినట్లు పేర్కొన్నారు.

పోలీసుల తీరుపై మహిళల ఆగ్రహం

వినయ్‌భాస్కర్‌ను పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ ఉన్న కొందరు మహిళలు కూడా పోలీసులను నిలదీసినట్లు ఆయన వర్గాలు తెలిపాయి. ఎంజీఎంలో కనీస వసతులు లేక తాము ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యలను తెలుసుకునేందుకు వచ్చిన వినయ్‌భాస్కర్‌ను ఎందుకు అడ్డుకుంటున్నారని వారు ప్రశ్నించినట్లు పేర్కొన్నారు. రోగులకు సరైన వైద్యం, కనీస సౌకర్యాలు కల్పించాలని మహిళలు డిమాండ్ చేసినట్లు తెలిపారు.

పేదలకు కనీస వైద్యం కరువు

ఎంజీఎంలో పేద ప్రజలకు కనీస వైద్య సదుపాయాలు అందడం లేదని వినయ్‌భాస్కర్ విమర్శించారు. రోగులకు సరిపడా బెడ్లు లేకపోవడం, ఆస్పత్రి భవనాల పైకప్పులు పెచ్చులూడిపడటం, అంబులెన్స్‌ల కొరత వంటి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆరోగ్యశ్రీ వార్డులో పైకప్పు పెచ్చులు ఊడిపడి రోగులు గాయపడిన ఘటన మరవకముందే మరో వార్డులోనూ ఇలాంటి పరిస్థితి ఏర్పడటం ఆస్పత్రి నిర్వహణ తీరుపై ఆందోళన కలిగిస్తోందన్నారు. రోగులకు వైద్యం అందించాల్సిన ఆస్పత్రిలోనే వారి భద్రతకు భరోసా లేకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఎంజీఎం వంటి కీలక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల సమస్యలను తెలుసుకునేందుకు ప్రజాప్రతినిధి వెళ్లడాన్ని అడ్డుకోవడం సరికాదని వినయ్‌భాస్కర్ అన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తే పోలీసులతో అడ్డుకోవడం నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ప్రజా పాలన అని చెప్పుకుంటున్న ప్రభుత్వం పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.



భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థి, యువత ఉద్యమించాలి

పి.డి.ఎస్.యు.రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు

అక్షరశక్తి, కేయూ క్యాంపస్ : దేశంలో నేటి విద్యార్థి, యువత భారత జాతీయోద్యమ వీరుడు షాహిద్ భగత్ సింగ్ పోరాట స్ఫూర్తిని మార్గదర్శకంగా తీసుకొని విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన కోసం సంఘటితంగా ఉద్యమించాలని పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు పిలుపునిచ్చారు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ ముందు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) ఆధ్వర్యంలో భారత జాతీయ ఉద్యమ వీరుడు షాహిద్ భగత్ సింగ్ 119వ జయంతి వారోత్సవాలు (సెప్టెంబర్ 22 నుండి 28 వరకు) పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలతో నివాళి అర్పించిన అనంతరం సభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బి.నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద ఫాసిస్టు విధానాలు దేశ లౌకిక వ్యవస్థకు, ప్రజల ఐక్యతకు ప్రమాదకరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో నేటి, విద్యార్థి యువత భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో ఢిల్లీలో జరిగిన జెన్ జీ పోరాట తరహా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. వరంగల్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు బోయినపల్లి అజయ్, పి.డి.ఎస్.యు. రాష్ట్ర గర్ల్స్ కోకన్వీనర్ పి.అనూష లు ప్రసంగించగా,
కె.యు. నాయకులు అఖిల్ ,నవీన్, సాయి, రాకేష్, కార్తీక్, విజేందర్, రాజు, కిరణ్, అశోక్, రజిత, ప్రవంతి, స్వాతి, స్నేహ, తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార రంగంలో రాణించాలి

అక్షరశక్తి, హైదరాబాద్: ముదిరాజ్, బీసీ, బహుజన యువత రాజకీయంగా, సామాజికంగా ఉన్నత స్థాయికి ఎదిగి రాజ్యాధికారానికి దగ్గరవ్వాలంటే వ్యాపార, వాణిజ్య రంగాల్లో రాణించాలని మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. హైదరాబాద్‌లో ముదిరాజ్ జాక్ రాష్ట్ర నాయకులు డాక్టర్ గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్, సుంకరబోయిన మహేష్ ముదిరాజ్, వెంకటస్వామి ముదిరాజ్ సంయుక్తంగా ప్రారంభించిన కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాలతోపాటు వ్యాపార, వాణిజ్య రంగాలపై యువత దృష్టి సారించాలని సూచించారు. ఆర్థికంగా బలపడటం ద్వారా సామాజికంగా, రాజకీయంగా మరింత ప్రభావవంతమైన పాత్ర పోషించే అవకాశం ఉంటుందన్నారు. డాక్టర్ గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్, సుంకరబోయిన మహేష్ ముదిరాజ్, వెంకటస్వామి ముదిరాజ్ వ్యాపార రంగంలో ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలపై ప్రత్యేక అవగాహన తరగతి

అక్షరశక్తి, కేయూ క్యాంపస్ : పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు సెప్టెంబర్ 23న ప్రత్యేక అవగాహన తరగతి నిర్వహించనున్నట్లు జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పుల్లా శ్రీనివాస్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ భవనంలోని కౌన్సెలింగ్ హాల్‌లో కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. కౌన్సిలర్, మోటివేటర్ చెరుకు సాయన్న ముఖ్య వక్తగా పాల్గొని వివిధ పోటీ పరీక్షలకు సమర్థంగా సిద్ధమయ్యే విధానం, అన్ని సబ్జెక్టుల్లో మెరుగైన మార్కులు సాధించేందుకు అనుసరించాల్సిన ప్రణాళికలు, మెళకువలపై అవగాహన కల్పించనున్నారని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మల్లేశం కుటుంబ సభ్యులను పరామర్శించిన రాపోలు ఆనంద భాస్కర్

అక్షరశక్తి, హనుమకొండ: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన లర్నర్స్ ల్యాండ్ విద్యా సంస్థల అధినేత తాళ్ల మల్లేశం కుటుంబ సభ్యులను మాజీ రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనంద భాస్కర్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, మాజీ జెడ్పీటీసీ చైర్మన్ సాంబారి సమ్మారావు, బీసీఐఎఫ్ ప్రణాళిక అడ్వైజర్ డాక్టర్ కొణతం కృష్ణ, బీసీఐఎఫ్ వరంగల్ బాధ్యులు ధర్మపురి రాజగోవిందు, పెద్దూరి పెద్దన్న, సదానందం వేముల, తాళ్ల మల్లేశం వియ్యంకులు, మిత్రుడు కూచన భాస్కర్ తదితరులు మంగళవారం పరామర్శించారు.
ఈ సందర్భంగా తాళ్ల మల్లేశం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తాళ్ల మల్లేశం విద్యా సంస్థల ద్వారా వేలాది మంది విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందించారని, ఆయన వద్ద విద్యనభ్యసించిన పలువురు దేశ, విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని పేర్కొన్నారు. విద్యారంగానికి తాళ్ల మల్లేశం చేసిన సేవలు చిరస్మరణీయమని వారు కొనియాడారు. ఆయన మృతి విద్యారంగానికి, విద్యార్థులకు తీరని లోటని అన్నారు.





ఐఏఎస్ ఆశావహులతో ముఖాముఖి

అక్షరశక్తి, వరంగల్: ఎన్ఐటీ వరంగల్ ఆధ్వర్యంలో 'టాక్ ఆన్ ఐఏఎస్ ఆస్పిరెంట్స్' పేరుతో ఐఏఎస్ ఆశావహులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం సాయంత్రం సెమినార్ హాల్స్ కాంప్లెక్స్‌లోని బోస్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి బెంగళూరు నార్త్ సిటీ కార్పొరేషన్ కమిషనర్, ఎన్ఐటీ వరంగల్ పూర్వ విద్యార్థి పొమ్మాల సునీల్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సివిల్ సర్వీసెస్ పరీక్ష, సన్నద్ధతా వ్యూహాలు, కెరీర్ అవకాశాలు, ప్రజా పరిపాలనలో బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రాథమిక అంశాలపై పట్టు, పద్ధతిబద్ధమైన ప్రణాళిక, సమకాలీన అంశాలపై అవగాహన, విశ్లేషణాత్మక, కమ్యూనికేషన్ నైపుణ్యాల అభివృద్ధి అవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు టి. కిశోర్‌కుమార్, ఎస్. శ్రీనివాసరావు, డీవీఎస్ఎస్ శివశర్మ, బెనర్జీ బాబు, శ్రీహరి రావు పత్రి, వి. రామ పాల్గొన్నారు. ఎన్ఐటీ వరంగల్ పూర్వ విద్యార్థులు ఎం. శరవణన్, సతీష్ మతంగి, రవీంద్రరావు కూడా హాజరయ్యారు. కార్యక్రమానికి 100 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది హాజరై ముఖాముఖి చర్చలో పాల్గొన్నారు.

ఎంజీఎం దుస్థితిపై ప్రశ్నిస్తే దాడులు చేస్తారా?

అక్షరశక్తి, హసన్‌పర్తి : వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి దుస్థితిని ప్రశ్నిస్తూ సందర్శనకు వెళ్లిన మాజీ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌పై పోలీసులు వ్యవహరించిన తీరును సీతంపేట మాజీ ఎంపీటీసీ బండారి రజితచేరాలు తీవ్రంగా ఖండించారు. ఎంజీఎంలో బెడ్లు, అంబులెన్స్‌ల కొరత, పైకప్పులు పెచ్చులూడుతున్న పరిస్థితిపై ప్రశ్నించిన ప్రజాప్రతినిధిని అడ్డుకుని దాడి చేయడం దారుణమన్నారు. ప్రజా సమస్యలను ప్రశ్నించినందుకు కడుపులో తన్నడం, గాయపర్చడం ఏ విధమైన ప్రజాస్వామ్య పాలన అని ప్రశ్నించారు. ఆస్పత్రుల పరిస్థితులను చక్కదిద్దాల్సిన ప్రభుత్వం ప్రశ్నించే వారిపై పోలీసులతో దాడులు చేయించడం సిగ్గుచేటన్నారు. పోలీసుల అత్యుత్సాహాన్ని అరికట్టి, వినయ్‌భాస్కర్‌పై జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని, ఆ గొంతును పోలీసు బలంతో అణచివేయడం సాధ్యం కాదన్నారు.

కేయూ వీసీని కలిసిన ఐఊప చీఫ్ కోఆర్డినేటర్

అక్షరశక్తి, కేయూ క్యాంపస్: ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ చీఫ్ కోఆర్డినేటర్, బిహార్‌లోని పాట్నాకు చెందిన ఆచార్య అనిల్‌కుమార్ ఠాకూర్ కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. డిసెంబరులో కేయూ ఆర్థికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 109వ ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ వార్షిక జాతీయ సదస్సు నిర్వహణ అంశాలపై చర్చించారు. సమావేశంలో ఆర్థికశాస్త్ర విభాగాధిపతి, సామాజిక శాస్త్రాల విభాగాల డీన్, దూరవిద్యా కేంద్రం సంచాలకులు, పాలకమండలి సభ్యులు ఆచార్య బి. సురేష్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా ప్రభుత్వంలో వరంగల్‌కు కొత్త రూపు తీసుకొస్తాం

- బీజేపీ, బీఆర్ఎస్‌లు రెండూ ఒక్కటే..
- ప్రాణత్యాగాల గాంధీ కుటుంబంపై కామెంట్ చేస్తే సహించం..
- రామ మందిరంలో చోరీకి పాల్పడిన దొంగలు బీజేపీ నాయకులు..
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



అక్షరశక్తి, హనుమకొండ: వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ డీసీసీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీ ఇనగాల వెంకట్రం రెడ్డి గారితో కలిసి ఆయన మాట్లాడారు. సోమవారం రాత్రి 11 గంటల వరకు వరంగల్ అభివృద్ధిపై సమగ్ర సమీక్ష నిర్వహించామని, ప్రతి పనికీ డెడ్‌లైన్ నిర్ణయించి ఎప్పటిలోగా పూర్తి చేయాలో స్పష్టమైన టైమ్‌లైన్ రూపొందించామని తెలిపారు. మామునూరు విమానాశ్రయం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రింగ్‌రోడ్, ఆసుపత్రులు, ఫిల్టర్‌బెడ్, దేవాలయాల అభివృద్ధి తదితర కీలక ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. వచ్చే నెల దసరాలోపే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్‌కు రానున్నారని, కాకతీయ యూనివర్సిటీ 50 ఏళ్ల వేడుకలు, ఆర్ట్స్ కాలేజీ శతాబ్ది ఉత్సవాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. జీవోలు ఇచ్చి వదిలేయడం తమ ప్రభుత్వ విధానం కాదని, నిధులు విడుదల చేసి టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తున్నామని నాయిని అన్నారు. మామునూరు విమానాశ్రయానికి గతంలో అవసరమైన అనుమతులు కూడా తీసుకురాలేదని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం భూసేకరణకు సుమారు రూ.300 కోట్లు విడుదల చేసి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లిందన్నారు. రాష్ట్రం తన బాధ్యతగా భూమిని సమకూర్చినందున విమానాశ్రయ నిర్మాణం, తదుపరి ప్రక్రియలో కేంద్రం తన బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. విమానాశ్రయానికి ఏ పేరు పెట్టాలన్నది ప్రజల అభిప్రాయాలతో నిర్ణయించుకోవచ్చని నాయిని అన్నారు. దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేస్తున్న వ్యాఖ్యలు అనవసరమని విమర్శించారు. గాంధీ కుటుంబంపై ఆయన చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టిన నాయిని.. దేశం కోసం త్యాగాలు చేసిన కుటుంబాన్ని విమర్శించే ముందు తమ చరిత్రను చూసుకోవాలని అన్నారు.

వరంగల్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు నాయకులు రాజకీయ విమర్శలకు దిగుతున్నారని నాయిని ఆరోపించారు. గత పదేళ్లలో వరంగల్‌కు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. స్మార్ట్‌సిటీ నిధులు వచ్చినా పూర్తిస్థాయిలో ఎందుకు వినియోగించలేకపోయారో గత పాలకులు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. వడ్డేపల్లి ఫిల్టర్‌బెడ్‌కు సుమారు రూ.550 కోట్ల ప్రాజెక్టు తీసుకొచ్చామని నాయిని తెలిపారు. టెండర్లు పూర్తయ్యాయని, పనులు ప్రారంభమయ్యాయని, మెటీరియల్ కూడా సైట్‌కు చేరుతోందన్నారు. 30-40 ఏళ్ల భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాగునీటి వ్యవస్థను రూపొందిస్తున్నామని చెప్పారు. చిన్నచిన్న పనులు చేసి ఫొటోలు దిగడం కాకుండా భవిష్యత్ అవసరాలకు సరిపోయే భారీ ప్రాజెక్టులను చేపడుతున్నామని తెలిపారు. గత పదేళ్ల పాలనలో అవినీతి, ఆస్తుల వ్యవహారాలపై పలు ఆరోపణలు చేసిన ఆయన.. వాటిపై సంబంధిత నేతలు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అభివృద్ధిపై మాట్లాడే ముందు గత పాలనలో జరిగిన పనులపై లెక్కలు చెప్పాలని అన్నారు.

సోషల్ మీడియాలో ఒక అబద్ధాన్ని పదిసార్లు ప్రచారం చేసినంత మాత్రాన అది నిజం కాదని నాయిని అన్నారు. ప్రజలు ఎవరు పనిచేస్తున్నారో, ఎవరు కేవలం విమర్శలు చేస్తున్నారో గమనిస్తున్నారని చెప్పారు. వ్యక్తిగత ఆరోపణలు, రాజకీయ డ్రామాల కంటే వరంగల్ అభివృద్ధిపై చర్చకు రావాలని, తాము డేటాతో కూడిన పూర్తి ప్రోగ్రెస్ రిపోర్టును ప్రజల ముందు పెట్టడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

వరంగల్ జిల్లా రూపురేఖలు మార్చే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని నాయిని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో వరంగల్‌ను కీలక నగరంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. మా సమాధానం మాటల్లో కాదు జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఉంటుంది అని నాయిని స్పష్టం చేశారు.

పర్యాటక రంగంలో జంతుశాస్త్రం, దేవాలయాల్లో ధ్వని శాస్త్రానికి ప్రాధాన్యం

అక్షరశక్తి, హనుమకొండ: పర్యాటక రంగ అభివృద్ధిలో జంతుశాస్త్రం, సహజ వారసత్వం, జీవవైవిధ్యానికి ఎంతో ప్రాధాన్యం ఉందని ప్రొఫెసర్ జి. సుహాసిని తెలిపారు. ప్రభుత్వ పింగిలి మహిళా కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్సులో భాగంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో 'పర్యాటక రంగంలో జంతుశాస్త్రం-సహజ వారసత్వం' అంశంపై ఆమె మాట్లాడారు. వన్యప్రాణులు, పక్షులు, సీతాకోకచిలుకలు, జీవవైవిధ్యాన్ని ఆధారంగా చేసుకుని వైల్డ్‌లైఫ్, సఫారీ, బర్డ్ వాచింగ్, బటర్‌ఫ్లై, ఎకో, ఎడ్యుకేషనల్ టూరిజాలను అభివృద్ధి చేయవచ్చన్నారు. ప్రాచీన రాజముద్రల్లో జంతువుల చిహ్నాలు, కోటల కందకాలలో మొసళ్ల వినియోగం వంటి అంశాలను వివరించారు.

డాక్టర్ పి. అరుణ 'రాతి, నీరు, కాంతి, ధ్వని శాస్త్రం-దేవాలయ నిర్మాణాలు' అంశంపై ప్రసంగించారు. కాకతీయుల నిర్మాణాల్లో రాతి స్తంభాలు, రాళ్ల ఇంటర్‌లాకింగ్ విధానం, నీటి సంరక్షణ పద్ధతులను శాస్త్రీయంగా వివరించారు. గోల్కొండ కోటలో ధ్వని ప్రతిధ్వని వినియోగం, ప్రాచీన నిర్మాణాల్లో కాంతి ప్రతిబింబించేలా చేసిన ఏర్పాట్లు, దేవాలయాల్లో సూర్యకిరణాలు గర్భగుడిని తాకేలా నిర్మించిన విధానాలను వివరించారు. అరసవల్లి సూర్యదేవాలయం, బృహదీశ్వర ఆలయం, సోమనాథ ఆలయం, వేయి స్తంభాల దేవాలయం, రామప్ప దేవాలయాల్లో ఇలాంటి నిర్మాణ విశేషాలు కనిపిస్తాయని తెలిపారు. కార్యక్రమానికి చరిత్ర విభాగాధిపతి, సర్టిఫికెట్ కోర్సు కన్వీనర్ డాక్టర్ కొలిపాక శ్రీనివాస్ ఆహ్వానం పలికారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సుహాసిని, చరిత్ర అధ్యాపకురాలు బి. జ్యోతి, విద్యార్థినులు పాల్గొన్నారు.







చిన్న పిల్లల మరణాలకు సీఎం రేవంత్ రెడ్డే బాధ్యత వహించాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



అక్షరశక్తి, హైదరాబాద్ : అదిలాబాద్ జిల్లా రిమ్స్ హాస్పిటల్‌లో కరెంట్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో ముగ్గురు చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరంమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ దుర్ఘటనలో ఇంకా 23 మంది పసిపిల్లలు గాయపడిన నేపథ్యంలో వెంటనే మెరుగైన చికిత్స అందించి వారి ప్రాణాలు కాపాడాలన్నారు. కాంగ్రెస్ సర్కారు ఘోర వైఫల్యం వల్లే ఇంత పెద్ద ప్రమాదం జరిగి, అభంశుభం తెలియని పిల్లలు అన్యాయంగా బలైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి ప్రభుత్వ వైద్య రంగాన్ని పూర్తిగా విధ్వంసం చేసిన సీఎం రేవంత్ రెడ్డే ఈ సంఘటనకు పూర్తి బాధ్యత వహించాలన్నారు. రిమ్స్ హాస్పిటల్‌లో నెలకొన్న దుస్థితులపై అనేకసార్లు బీఆర్ఎస్ జిల్లా నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించినా మొద్దునిద్ర పోయిన రేవంత్ సర్కారులో కనీస చలనం కనిపించలేదు. అత్యంత పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన పిల్లల వార్డులో ప్రభుత్వ పర్యవేక్షణ పూర్తిగా లోపించడం, కనీస నిర్వహణ లేకపోవడం వల్లే ఈ దురదృష్టకర సంఘటన చోటుచేసుకుందన్నారు. ఆదిలాబాద్ రిమ్స్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ దవాఖానల్లోని పిల్లల వార్డులు, ఐసీయూలను నిపుణులతో తనిఖీ చేయించి ఇలాంటి సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రేవంత్ సర్కారు చేతకానితనం వల్ల తమ పసిపిల్లలను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మైనర్ బాలికపై లైంగిక దాడి.. నిందితుడికి యావజ్జీవం

అక్షరశక్తి, భూపాలపల్లి: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడి, ఆమె ఆత్మహత్యకు కారకుడైన నిందితుడు గోల్కొండ రాజశేఖర్‌కు భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జె. జీవన్‌కుమార్ యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. రూ.10 వేల జరిమానా కూడా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. కాటారం మండలం ధన్వాడకు చెందిన మైనర్ బాలిక 2021 డిసెంబర్ 9న ఆధార్ కార్డు మార్పు కోసం కాటారం వెళ్లేందుకు బస్టాండ్‌లో ఆటో కోసం వేచి ఉండగా పరిచయస్తుడైన వ్యక్తితో కలిసి ద్విచక్రవాహనంపై బయలుదేరింది. మార్గమధ్యంలో రాజశేఖర్ బాలికను బెదిరించి తన గదికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. మనస్తాపానికి గురైన బాలిక కాటారంలో గడ్డి మందు సేవించి ఇంటికి వెళ్లింది. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. బాలిక బాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి కాటారం ఏఎస్ఐ మహేందర్ కేసు నమోదు చేశారు. అనంతరం సీఐ రంజిత్‌రావు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తు అనంతరం చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ నాగార్జునరావు, ఎస్ఐ సీహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కోర్టు లైజన్ అధికారి ఏఎస్ఐ జి. వెంకన్న, కోర్టు కానిస్టేబుల్ కె. రమేష్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎన్. విష్ణువర్ధన్‌రావు, జి. వెంకట్రామ్ వాదనలు వినిపించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి యావజ్జీవ శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు. కేసు దర్యాప్తు, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అభినందించారు.

సాగునీళ్లు ఇవ్వాలని ఇల్లందు మహబూబాబాద్ జాతీయ రహదారిపై రైతుల ధర్నా



అక్షరశక్తి, మహబూబాబాద్: పంటలు సాగు నీళ్లు ఇవ్వాలని ఇల్లందుమహబూబాబాద్ జాతీయ రహదారి బయ్యారం బస్టాండ్ సెంటర్ వద్ద రైతులు ధర్నా చేశారు. బయ్యారం పెద్ద చెరువు ఆయకట్టు రైతులు ఈ ఏడాది వానాకాలంలో సుమారు ఆరు వేల ఎకరాల్లో పంటలు వేశారు. అయితే వర్షాలు సరిగా పడకపోవడంతో పంటలకు నీరు లేక ఎండిపోతున్నాయి. ఈ క్రమంలో బయ్యారం పెద్ద చెరువు గరిష్ఠ నీటి మట్టం 16.2 అడుగులు చేరి ఇటీవల మత్తడి పడింది. దీంతో రైతులు గత కొన్ని రోజులుగా పంటల సాగుకు నీరు అందించాలని అధికారులను కోరుతున్నారు. అధికారులు నీటి విడుదల విషయంపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో శుక్రవారం సమావేశమైన రైతులు ఆందోళనలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో బయ్యారం బస్టాండ్ సెంటర్లోని రహదారిపై గంట సేపు ధర్నా నిర్వహించారు. పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ కావడంతో అక్కడికి తాసిల్దార్ నాగరాజు, ఇరిగేషన్ డీఈ సాగర్, సీఐ రవీందర్ చేరుకొని రైతులతో మాట్లాడారు. తమ పంటలు ఎండిపోతున్న అధికారులు పట్టించుకోవడంలేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు వాపోయారు. వేల ఎకరాల పెట్టుబడి పెట్టి పంటలు సాగు ప్రారంభించామని నీళ్లు ఇవ్వకపోతే పంటలు ఎండి నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రెండు రోజుల్లో నీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామని రైతులకు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

రిమ్స్ ఘటనపై సీఎం విచారం

అక్షరశక్తి, హైదరాబాద్ : ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రి ఎస్ఎన్‌సీయూ వార్డులో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు దారితీసిన కారణాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని ఆదేశించారు.

ప్రిన్సిపాల్‌ను తొలగించాలి: ఎస్ఎస్‌యూ



అక్షరశక్తి, హనుమకొండ: కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకరి జ్యోతిని పదవి నుంచి తొలగించాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ (ఎస్ఎస్‌యూ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరినప్పుడు ప్రిన్సిపాల్ వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రొఫెషనల్, నాన్ ప్రొఫెషనల్ కోర్సుల విషయంలో విద్యార్థులను గందరగోళానికి గురిచేస్తూ స్కాలర్‌షిప్‌లు రావని చెబుతున్నారని పేర్కొన్నారు. సమయపాలన పాటించకుండా విధులకు హాజరవుతున్నారని ఆరోపించారు. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులకు కనీస మర్యాద ఇవ్వడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులను చదువుకోకుండా అడ్డుకునే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఆమెను విధుల నుంచి తొలగించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు శివకుమార్, రాజ్‌కుమార్, అభిలాష్, నాగరాజు, బంటి, సుఖేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ



అక్షరశక్తి, హనుమకొండ: భక్తాంజనేయస్వామి దేవాలయంలో 25వ సంవత్సర గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రాచమల్ల సునీత-రాజిరెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హనుమకొండ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, 10వ డివిజన్ మాజీ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకుడు తోట పవన్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు అతిథులను ఘనంగా సన్మానించారు. సుమారు 1,500 మంది భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. రేపు గణపతి నిమజ్జనానికి భక్తులు ఉత్సాహంగా తరలిరావాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కనుకుంట్ల రవికుమార్, ప్రధాన కార్యదర్శి పోలు లక్ష్మణ్, కోశాధికారి కట్ల రఘు, గౌరవ అధ్యక్షులు తోట కనకరాములు, తోట ప్రకాష్, ఉపాధ్యక్షులు తోట శ్రీనివాస్, దొమ్మటి శ్రీకాంత్, కట్ల రవీందర్, తోట శ్రీనివాస్, కార్యదర్శులు రేనా దిలీప్, కట్ల రమేష్, రాకేష్, కట్ల రాయమల్లు, నారాయణ, తోట కరుణాకర్, జక్కుల ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

కేయూలో 24న ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం



అక్షరశక్తి, కేయూక్యాంపస్ : కాకతీయ విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవ సంవత్సరాన్నిపురస్కరించుకుని సెప్టెంబర్ 24న ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు యూనివర్సిటీ ఆడిటోరియంలో కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా కేయూ ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్‌రెడ్డి హాజరుకానున్నారు. గౌరవ అతిథులుగా ఎన్ఎస్ఎస్ పూర్వ కోఆర్డినేటర్లు ఆచార్య కె. వెంకటనారాయణ, ఆచార్య ఎ. సీతారాం నాయక్, ఆచార్య బి. సురేష్‌లాల్, ఆచార్య ఎస్. జ్యోతి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్, విశ్రాంత రాష్ట్ర జాతీయ సేవా పథకం లైజన్ అధికారి ఎం. శంకరయ్య పాల్గొంటారు. ప్రత్యేక అతిథులుగా ఆచార్య ఎం. కిష్టయ్య, ఆచార్య జి. కృష్ణమూర్తి, ఆచార్య బాలస్వామి, ఆచార్య జి. బెనర్జీ, ఆచార్య టి. శ్రీనివాస్, ఆచార్య బి. దిగంబర్‌రావు, ఆచార్య జే. కృష్ణవేణి, ఆచార్య ఎ.సి. నరసింహాచారి, ఆచార్య ఎం. రమణ, ఆచార్య కె. భిక్షాలు హాజరుకానున్నారు.

చాకిరేవు బండగుట్ట మైనింగ్ లీజు రద్దు చేయాలి



అక్షరశక్తి, నడికూడ: మండలంలోని కంటాత్మకూరు గ్రామంలో చాకిరేవు బండగుట్ట మైనింగ్ లీజును రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని కోరారు. మైనింగ్ ప్రారంభిస్తే చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, పంట పొలాలు కాలుష్యంతో నష్టపోయే ప్రమాదం ఉందని గ్రామ సర్పంచ్ కొంగంటి తిరుపతి తెలిపారు. చాకిరేవు బండగుట్టను గ్రామస్తులు ప్రకృతి అందాలను ఆస్వాదించే ప్రాంతంగా వినియోగిస్తున్నారని చెప్పారు. గుట్ట సమీపంలోని పాత చెక్‌డ్యామ్ కూడా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. సుమారు 1,600 ఎకరాల పంట పొలాలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మైనింగ్ నిలిపివేయకపోతే చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో కలిసి కలెక్టరేట్ ముట్టడి చేపడతామని హెచ్చరించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

సీఎం రేవంత్‌రెడ్డి

అక్షరశక్తి, హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో భారీ వర్షం నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హైడ్రా, పోలీసు కమిషనర్లు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రధాన రహదారులు, జంక్షన్లు, కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో వెంటనే సిబ్బంది, యంత్రాలను రంగంలోకి దించాలని చెప్పారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, ట్రాఫిక్ నిలిచిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని, కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పనిచేసేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉంటూ పరిస్థితిని పర్యవేక్షించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

రామప్ప దేవాలయంను సందర్శించిన ప్రముఖ సినినటుడు తనికెళ్ళ భరణి

అక్షరశక్తి, ములుగు: మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని మంగళవారం ప్రముఖ సిని నటుడు తనికెళ్ళ భరణీ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ లు వారికి స్వాగతం ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేసి, స్వామి వారి శేషవస్త్రాలను బహూకరించారు. వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ లు ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం, కాకతీయుల చరిత్ర గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రామప్పను సందర్శించడం రెండోసారి అని రామప్ప శిల్పకళ అద్భుతం అని, ఎన్ని సార్లు చూసిన తనివి తీరనది రామప్ప శిల్ప కళ అని అన్నారు. తాను రామప్ప శిల్పకళపై రాసిన ఆటగదరా శివ ఆటగదరా రామప్ప శిల్పాల అంగవైకల్యాలు పాటను గుర్తు చేసుకున్నారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, టూరిస్ట్ పోలీసులు, శ్రీనివాస్, శ్రీకాంత్, బద్రు, అరుణ్, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.



దళిత, గిరిజనుల అభివృద్ధే లక్ష్యం



- విద్య, ఉపాధి, నైపుణ్యాలతోనే సమాజంలో మార్పు
- అణిచివేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేద్దాం
- అట్రాసిటీ బాధితులకు సకాలంలో పరిహారం.. 'గ్రీన్ ఛానెల్'లో నిధులు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీస్ కేసులపై ఉన్నతస్థాయి కమిటీ సమీక్ష



అక్షరశక్తి, హైదరాబాద్, సెప్టెంబరు 22 : దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే సమాజంలో శాశ్వత మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలపై అణిచివేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నిరోధక చట్టం 1989 అమలుపై మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆయన అధ్యక్షతన ఉన్నతస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు, విచారణ, పరిష్కారం, బాధితులకు అందుతున్న సహాయం, పునరావాసం తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు.

2013 తర్వాత తొలిసారి సమావేశం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 ఫిబ్రవరి 11న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం అమలుపై రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ స్థాయి సమావేశం మళ్లీ జరగడం ఇదే తొలిసారని ప్రభుత్వం పేర్కొంది. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, ఎంపీలు మల్లు రవి, పోరిక బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఎమ్మెల్యేలు తోట్ల కృష్ణారెడ్డి, మేడిపల్లి సత్యం, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, వీర్లం వెంకటేశం, మందుల సామేల్, మట్టా రాగమయి, వేడ్మ బోజ్జు, మురళి నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్‌బాబు, ఎస్సీ కమిషన్ సభ్యులు, పలువురు ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు.

73 గ్రామాలపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో గత ఐదేళ్లలో ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసులు క్రమంగా తగ్గుముఖం పట్టాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అయితే కొన్ని జిల్లాల్లోని 73 గ్రామాల్లో అధిక సంఖ్యలో కేసులు నమోదవుతున్నట్లు నివేదించారు. ఆయా గ్రామాలపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు. జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా జరిగేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు, కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టులు, మొబైల్ కోర్టుల పనితీరును కూడా సమావేశంలో సమీక్షించారు. కేసుల దర్యాప్తు, విచారణలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బాధితులకు 'గ్రీన్ ఛానెల్'లో పరిహారం

అట్రాసిటీ ఘటనలపై ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందించాలని ముఖ్యమంత్రి అన్నారు. బాధితులకు సకాలంలో నష్టపరిహారం, సహాయం తోపాటు పునరావాసం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు పరిహారం, సహాయం అందించడాన్ని బడ్జెట్ అంశాలతో ముడిపెట్టకుండా 'గ్రీన్ ఛానెల్' ద్వారా నిధులు విడుదల చేయాలని సూచించారు. ఇటీవల చోటుచేసుకున్న షాబాద్ హత్యల కేసు, తుక్కుగూడలో నర్సుపై అత్యాచారం, హత్య కేసులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయా కేసుల్లో బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

27.5 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం

రాష్ట్రంలో 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అల్పాహారం అందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా అట్టడుగు వర్గాల విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతోందన్నారు. రాష్ట్రంలో 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, తద్వారా దళిత, గిరిజన వర్గాలకు పోషకమైన ఆహారం అందించగలుగుతున్నామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలతో పాటు విద్య ద్వారానే అట్టడుగు వర్గాల జీవితాల్లో శాశ్వత మార్పు సాధ్యమవుతుందని సీఎం స్పష్టం చేశారు. పిల్లలను చదువు, క్రీడల వైపు ప్రోత్సహించాలని సూచించారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఇందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

ఇందిరమ్మ స్ఫూర్తితోనే సంక్షేమం

అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ దళిత, గిరిజన వర్గాల సంక్షేమానికి చేసిన కృషిని ఆయన ప్రస్తావించారు. 25 లక్షల ఎకరాల భూములకు అసైన్డ్ పట్టాలు అందించిన ఘనత ఇందిరాగాంధీదేనని పేర్కొన్నారు. ఆమె స్ఫూర్తితోనే ప్రజాప్రభుత్వం పనిచేస్తోందన్నారు. బడ్జెట్‌లో జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ జనాభా సుమారు 16 శాతం ఉండగా, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో 31 శాతం మంది ఎస్సీ లబ్ధిదారులు ఉన్నారని వివరించారు. ఎస్టీ జనాభా 10 శాతం ఉంటే.. వారికి 17 శాతం ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.